సాక్షి
నంద్యాల

సోమవారం ı 12 ı జూన్ ı 2023



మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా ఆదివారం గుంటూరుకు చెందిన బి.స్వర్ణలత బృందం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది.



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,581.07
టీఎంసీల సామర్థ్యం	:105,788
ప్రస్తుతం	:5,013
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:341
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:245

న్యూస్‌రీల్

నేడు స్పందన కార్యక్రమం

నంద్యాల: స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు.

ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా సాగింది. 20 పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 2,221 మంది హాజరు కాగా 326 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ అనురాధతో పాటు ఎంఈఓ బ్రహ్మంనాయక్‌లు పరిశీలించారు.

భాషా పండిట్ల బదిలీల కౌన్సెలింగ్ పూర్తి

కర్నూలు (సిటీ): భాషా పండిట్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ బదిలీల ప్రక్రియ పూర్తయింది. ఆదివారం పండిట్స్, పీడీలకు మ్యానువల్‌గా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదటగా ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లకు, హిందీ పండిట్లకు, తెలుగు పండిట్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న సమయంలో చూపిన ఖాళీలలోనే బదిలీలు నిర్వహించారు. బదిలీ స్థానాన్ని ఎంపిక చేసుకున్న వెంటనే ఉత్తర్వులు సైతం అందజేశారు. ఈ బదిలీలతో జిల్లా విద్యాశాఖ పరిధిలోని ఉపాధ్యాయుల బదిలీలన్నీ పూర్తయ్యాయి. కేవలం కోర్టు కేసుతో భాషా పండిట్ల పదోన్నతులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇక అన్ని క్యాటగిరీల బదిలీలు, పదోన్నతులు పూర్తి కావడంతో బదిలీ ఉత్తర్వులు పొందిన వారందరూ సోమవారం నుంచి పునః ప్రారంభం కానున్న పాఠశాలల్లో చేరాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. బదిలీల ప్రక్రియలో డీఈఓ రంగారెడ్డి, ఏడీ శామ్యూల్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో శ్రీగిరి కిటకిట



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వేకువజామున్నే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, మల్లన్న దర్శనానికి క్యూలైన్ల వద్దకు చేరుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేకువజాము నుంచే భక్తులను మల్లన్న దర్శనానికి అనుమతించారు. కంపార్ట్‌మెంట్లలో, క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థాన అధికారులు పర్యవేక్షణ చేపట్టారు. మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లను పంపిణీ చేశారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో ఆలయ ప్రధాన వీధులన్ని కిటకిటలాడాయి.



ఇది ఉయ్యాలవాడ మండలం కాకరవాడ ప్రాథమిక పాఠశాల. నాడు–నేడు కింద చేపట్టిన పనులతో కార్పొరేట్ స్కూల్‌ను తలపిస్తుంది. 8 పనులకు గాను ప్రభుత్వం రూ.18.29 లక్షలు మంజూరు చేయగా రూ. 16.16 లక్షలు ఖర్చు చేశారు. మరుగుదొడ్లకు రూ.7.,03 లక్షలు, తాగునీటి కోసం రూ.1.44 లక్షలు, మేజర్ అండ్ మైనర్ మరమ్మతుల కోసం రూ. 3.73 లక్షలు, విద్యుదీకరణకు రూ.65,214, ఫర్నిచర్‌కు రూ.2.48 లక్షలు, గ్రీన్ బోర్డులకు 32,068, స్కూల్ రంగులకు రూ.1,96,321 ఖర్చు చేశారు.



మహానంది మండలం తిమ్మాపురం మోడల్ స్కూల్‌లో గత ఏడాది ఆరు నుంచి 10వ తరగతి వరకు 440 మంది ఉండగా ఈ ఏడాది ఈ సంఖ్య 500 చేరింది. విద్యార్థులకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు కూడా ప్రభుత్వం నియమించింది. పాఠశాలలో 15 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులు, ముగ్గురు కాంట్రాక్ట్ ఉద్యోగులు, లైబ్రేరియన్, కంప్యూటర్ ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్, వొకేషనల్ ట్రైనర్‌లు ఉన్నారు. బదిలీల్లో ఇద్దరు టీచర్లు వస్తే పాఠశాలలో ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో ఉంటారు.



శిరివెళ్ల మండలం జెడ్పీ హైస్కూల్‌లో 909 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ పాఠశాలకు వచ్చిన రోజే విద్యాకానుక కిట్లు పంపిణీ చేయడానికి అధికారులు సిద్ధం చేశారు. కిట్టులో బ్యాగు, ప్రింటింగ్ పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, షూ, బెల్టు, రెండు రకాల డిక్షనరీలు ఉండనున్నాయి. బెల్టు 1 నుంచి 10వ తరగతి బాలురకు, 1 నుంచి 5వ తరగతి వరకు బాలికలు అందిస్తారు. నోట్ బుక్‌లు 6 నుంచి పది విద్యార్థులకు, డిక్షనరీలు 1 నుంచి 6వ తరగతి వరకు ఒక రకం, 7 నుంచి 10 వతరగతి వరకు మరో రకం అందిస్తారు.

సరస్వతీ నమస్తుభ్యం.. సమస్తం సిద్ధం

నేలబారు చదువులు.. బడులు తెరిచినా అందని పుస్తకాలు.. అత్యవసరాలకు ఇంటికే.. ఒకే గదిలో ఐదు తరగతులు.. ఉపాధ్యాయులు లేక బడికి తాళం.. మధ్యాహ్న భోజనంలో మెనూ మాయం.. ఇదీ గతంలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితి. ఇప్పుడు సర్కారు బడులు సరికొత్త వసతులతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థుల రాక కోసం ఎదురు చూస్తున్నాయి. పేద విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు సోమవారం నుంచి పునఃప్రారంభం నేపథ్యంలో ప్రత్యేక కథనం. – నంద్యాల



షూలను పాఠశాలలకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

నేటి నుంచి మోగనున్న బడిగంటలు

- జిల్లాలో 1409 పాఠశాలలు, 1.75 లక్షల మంది విద్యార్థులు
- పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యాకానుక పంపిణీ
- 9 రకాల వస్తువులతో కిట్ల అందజేతకు ఏర్పాట్లు పూర్తి

వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి జిల్లాలో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటి దాకా ఆటపాటలతో సరదాగా గడిపిన చిన్నారులు ఇక నుంచి పుస్తకాలతో కుస్తీ పట్టనున్నారు. పాఠశాల తెరిచిన మొదటిరోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. కిట్లు ఇప్పటికే అన్ని జిలా కేంద్రం నుంచి మండలాలకు చేరుకున్నాయి. నంద్యాల జిల్లాలోని 29 మండలాల్లోని 1409 పాఠశాలల్లో 1,75,888 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ



ఆలమూరు పాఠశాలలో నూతన బెంచీలు

తొమ్మిది రకాల వస్తువులతో ఉన్న కిట్లను పంపిణీ చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, గురుకులాలు, ఆశ్రమ మోడల్, కేజీబీవీ రిజిస్టార్, మదర్సా పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కిట్లను పంపిణీ చేయనున్నారు. కిట్లలో మూడు జతల యూనిఫాం క్లాత్, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్ట్, పిక్టోరల్ డిక్షనరీ, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, బ్యాగ్ పంపిణీ చేయనున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి పేద విద్యార్థులకు భరోసా కల్పించారు. మన బడి నాడు –నేడు, అమ్మఒడి, విద్యా కానుక, గోరుముద్ద పథకాల అమలు చేయడంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యాయి. వసతులు పెరగడంతో పాటు నాణ్యమైన విద్య అందుతుండటంతో కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ల బోర్డులు పెట్టిన సందర్భాలు ఉన్నాయి.

వసతులు మెరుగు‘బడి’..

గత పాలకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలో వసతులు, విద్యాబోధన సరిగ్గా లేక చాలా మంది విద్యార్థులు ప్రైవేటు బాట పట్టారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకంతో వాటి రూపురేఖలు మార్చేశారు. జిల్లాలో నాడు–నేడు కింద మొదటి విడత 486 పాఠశాలలను రూ.117 కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే రెండో విడతలో 974 పాఠశాలలో రూ.363.55 కోట్లతో పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే రెండో విడతలో రూ.108 కోట్లు ఖర్చు చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించారు. దీంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించేందుకు మొగ్గు చూపుతున్నారు.



బేతంచెర్ల మండలం హనుమాన్ నగర్ జెడ్పీపాఠశాలలో హ్యాండ్‌వాష్ కుళాయిలు

ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన..

పేద విద్యార్థులు చదువులో రాణించేలా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియాన్ని ప్రవేశపెట్టింది. 1 నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలోనే విద్యాబోధనకు కృషి చేస్తోంది. ప్రస్తుతం 9, 10, తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో విద్యాబోధన చేయనున్నారు. ఈ తరగతులకు చెందిన విద్యార్థులు వారి ఇష్టం మేరకు ఏదో ఒక మీడియాన్ని ఎంచుకునే అవకాశం కల్పించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో విద్యార్థులకు చదువు చెప్పడానికి అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు.

“ 17వ తేదీ వరకు ఒంటి పూట బడి



పాఠశాలలు సోమవారం నుంచి పునః ప్రారంభం అవుతున్నాయి. కాగా ఇదే సమయంలో వడగాల్పులు, తీవ్ర ఉష్ణోగ్రత నేపథ్యంలో ఒంటి పూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. జూన్ 17 వరకు ఉదయం 7.30 నుంచి 11.30గంటల వరకు తరగతులు నిర్వహిస్తాం. జూన్ 19 నుంచి యథాతథంగా విద్యాప్రణాళిక షెడ్యూల్ అమలు కానుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రతి ఒక్కరికి జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తాం.

– అనురాధ, డీఈఓ, నంద్యాల

ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో ఆడిటోరియంలో ఈనెల 8న ప్రారంభమైన రాష్ట్రస్థాయి అండర్ –19 ఓపెన్ ఫిడే రేటింగ్ చదరంగం పోటీలు ఆదివారం ముగిశాయి. ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా అసోసియేషన్ నిర్వహణలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో తిరుపతికి చెందిన విశాల్ చౌదరి, ద్వితీయ స్థానంలో గుంటూరుకు చెందిన ధ్రువేష్, తృతీయ స్థానంలో కోనసీమ జిల్లాకు చెందిన సాత్విక్, నాల్గవ స్థానంలో గుంటూరుకు చెందిన స్నేహిల్ నిలిచారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ నంద్యాల జిల్లా సంఘం చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీవీ శర్మల ఆధ్వర్యంలో విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. విజేతలుగా నిలిచిన వారు జాతీయ స్థాయి చెస్ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటారని ప్రకటించారు. వివిధ వయస్సు కేటగిరిల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, నగదు బహుమతులు విజేతలకు అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రాంతీయ చైర్మన్ కొట్టె చంద్రశేఖర్, ఆంధ్రా చెస్ సంయుక్త కార్యదర్శి రామసుబ్బారెడ్డి, లయన్స్‌క్లబ్ కోశాధికారి రత్నకుమార్, ఆర్బిటర్లు ఇమామ్, నాగ శ్రీనివాస్, సుజాత పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీలు అందజేసిన దృశ్యం

కేఎంసీలో పీజీ సీట్ల పెంపు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో పీజీ సీట్లు మరింత పెరిగాయి. ఈ మేరకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఉత్తర్వులు జారీ చేసింది. పాథాలజీ విభాగంలో పీజీ సీట్ల సంఖ్య నాలుగు నుంచి 8కి, పీడియాట్రిక్(చిన్నపిల్లల విభాగం)లో పీజీ సీట్ల సంఖ్య 11 నుంచి 15కు పెంచుతూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పీజీ సీట్లు పెరుగుదల పట్ల ఆయా విభాగాల వైద్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జొన్నగిరిలో వజ్రం లభ్యం

తుగ్గలి: తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరిలో పొలం పనులకు వెళ్లిన ఓ వ్యక్తికి ఆదివారం వజ్రం లభ్యమైనట్లు సమాచారం. ఈ వజ్రాన్ని ఓ వ్యాపారి రూ.30వేలకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. తొలకరి వర్షాలకు ఈ ప్రాంతంలో ఏటా వజ్రాలు లభ్యమవు తుండడం తెలిసిందే. దీంతో పలువురు వజ్రాన్వేషణలో పొద్దున్నే పొలాల్లో వాలిపోయి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంటారు.

నేడు డీసెట్

కర్నూలు సిటీ: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌కి సంబంధించిన డీసెట్‌ను నేడు (సోమవారం) నిర్వహించనున్నారు. కర్నూలు సనత్‌నగర్‌లోని అయాన్ డిజిటల్ జోన్ ఐడీ జెడ్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి మధ్యా హ్నం 12.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్న పరీక్షకు 357 మంది విద్యార్థులు హాజరుకానునున్నారు. పరీక్షకు సంబంధించిన ఏమైనా ఫిర్యాదులు ఉంటే 9849932289కు ఫోన్ చేయవచ్చు.

బృందావన ప్రతిమకు బంగారు పల్లకీ సేవ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం బృందావన ప్రతిమను బంగారు పల్లకీలో ఊరేగించారు. తెల్లవారుజాము నుంచి పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఉంచి శ్రీ మఠం మాడ వీధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తుంగభద్ర నదిలో స్నానమాచరించి గ్రామ దేవత మంచాలమ్మ అమ్మవారిని, శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు.

సీఎం సహకారంతో మోడల్ నియోజకవర్గంగా డోన్



ఉన్నతాధికారులతో సమావేశమైన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

- ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ సహకారంతో డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో రూ.3కోట్ల వ్యయంతో అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన ఆర్అండ్‌బీ వసతి గృహాన్ని ఆదివారం జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల వెంకటరెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రం రైల్వే జంక్షన్ కావడం, పట్టణ శివార్లలో 44వ జాతీయ రహదారి వెళ్తుండటంతో ప్రముఖులు సేద తీరేందుకు ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ అవసరం ఎంతో ఉందన్నారు. నాలుగు సూట్ గదులు, కిచెన్, మీటింగ్ హాల్ అత్యాధునిక సదుపాయాలతో అతిథి గృహాన్ని నిర్మించామన్నారు. ఈ కార్యక్రమానికి రోడ్లు భవనాలుశాఖ, రవాణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, డీఐజీ శ్రీనివాసరెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లా కలెక్టర్లు సృజన, మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీలు కృష్ణకాంత్, రఘువీర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఝాన్సీరాణి, డీఈ ప్రసాద్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటరెడ్డి, ఏఈ శ్రీకాంత్, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, రాష్ట్రమీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, జెడ్పీటీసీ రాజ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొట్రికె హరికిషన్, జాకీర్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పోస్టు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్అండ్‌బీ అతిథి గృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి తదితరులు

‘సిరి’మల్లె

- విస్తరిస్తున్న మల్లె సాగు
- రోజూ 10 టన్నుల దిగుబడి
- హైదరాబాద్ మార్కెట్‌కు తరలింపు
- వందల మందికి ఉపాధి

చాగలమర్రి: ఉమ్మడి కర్నూలు జిల్లాలో మల్లె సాగు దాదాపు 4 వేల ఎకరాల్లో విస్తరించగా నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలోనే 2,500 ఎకరాల్లో సాగు చేయడం విశేషం. ఏటా వాతావరణం అనుకూలించడం, దిగుబడులు పెరగడం, గిట్టుబాటు ధరలు లభిస్తుండటంతో మల్లె రైతులు లాభాలు గడిస్తున్నారు. మండలంలో మల్లె సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో సారవంతమైన నల్లరేగడి నేలలతో పాటు బోరుబావుల్లో నీరు సమృద్ధిగా ఉండటంతో పలువురు రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. వీరిలో అత్యధిక విస్తీర్ణంలో పూల తోటలు వేస్తున్నారు. చాగలమర్రి, ముత్యాలపాడు, చింతల చెరువు, గొడిగనూరు, చిన్నవంగలి, మల్లెవేముల, నగళ్లపాడు, కలుగొట్లపల్లెల్లో మల్లె తోటలు గుబాళిస్తున్నాయి. ఎకరాకు రూ. లక్ష నుంచి రెండు లక్షల వరకు రైతులు ఏటా లాభం పొందుతున్నారు. ప్రతి సంవత్సరం జనవరి నుంచి ఆగస్టు వరకు పూల దిగుబడి ఉండటంతో ఎనిమిది నెలల పాటు వందల మందికి ఉపాధి లభిస్తోంది. రోజూ మండలం నుంచి దాదాపు 10 టన్నుల మల్లె పూలు ఎగుమతి అవుతున్నాయి. పూల సాగు, కోత, పూలు మాలగా కుట్టడం, ఎగుమతి దృష్ట్యా పూల సాగు ఓ పరిశ్రమగా కనిపిస్తోంది. ఈ క్రమంలో చాగలమర్రిలో మల్లె పూల మండి ఏర్పాటైంది. రైతుల నుంచి పలువురు వ్యాపారులు పూలు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. చేతికొచ్చిన దిగుబడిని రైతులు స్థానిక మార్కెట్‌కు చేర్చితే అక్కడి నుంచి వ్యాపారులు హైదరాబాద్‌కు తరలించడంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు.

చల్లగా ప్యాక్ చేసి..

ప్రస్తుతం మండలంలోని తోటల్లో ఎకరాకు రోజూ సరాసరి 50 కేజీల కోత కోసినా మొత్తం దాదాపు 8 నుంచి 10 టన్నుల పూలను దిగుబడి వస్తోంది. ఈ పూలను స్థానికంగా ఏర్పాటైన నాలుగు మండీల యజమానులు సేకరిస్తారు. వీటిని హైదరాబాద్ నగరానికి వాహనాల్లో తరలిస్తారు. పూలు వాడి పోకుండా చాలా భద్రంగా ప్యాక్ చేస్తారు. ప్లాస్టిక్ కవర్లలో ఐస్ గడ్డలు వేసి వాటిని థర్మాకోల్ బాక్స్‌లో ఉంచి ఆ తర్వాత సుమారు 30 నుంచి 50 కేజీల పూలు వేసి ప్యాక్ చేస్తారు. ప్యాక్ చేసిన ఆరు గంటల్లోపు మార్కెట్‌కు చేర్చాలి. అక్కడి నుంచి మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలకు విమానంలో తరలిస్తారు. పూలను సకాలంలో మార్కెట్‌కు తరలించే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి.



రెండు విడతలుగా కొనుగోలు..

హైదరాబాద్ నగరంలోని గుడిమల్కాపూర్ పూల మార్కెట్ నిర్ణయించిన ధర మేరకు స్థానిక వ్యాపారులు రైతుల నుంచి పూలు కొనుగోలు చేస్తున్నారు. అక్కడి డిమాండ్ మేరకు ఉదయం, సాయంత్రం రెండు పర్యాయాలు రేటు నిర్ణయిస్తారు. ఈ క్రమంలో దిగుబడి అధికంగా ఉన్న రైతులు తెల్లవారుజామున 5 గంటల నుంచి కోత మొదలు పెట్టి ఉదయం పది గంటల లోపు స్థానిక మండికి చేర్చుతారు. ఉదయం రేటు కొంత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం 3.30 గంటలకు మరోసారి ధర నిర్ణయించి కొనుగోలు చేస్తారు. కమీషన్ తీసుకుని గుడి మల్కాపూర్ వ్యాపారులకు స్థానిక వ్యాపారులు పూలను ఎగుమతి చేస్తున్నారు. పది రోజులకోసారి మండి నిర్వాహకులకు డబ్బులు చెల్లించిన తర్వాత స్థానిక రైతులకు అందజేస్తారు.



మల్లెపూలు కోస్తున్న కూలీలు

మహిళలకు ఉపాధి..

మల్లెపూల సాగు చాగలమర్రిలో కుటీర పరిశ్రమగా అభివృద్ధి చెందుతోంది. వ్యాపారులు విడి పూలతో పాటు దండగా అల్లిన పూలను కూడా ఎగుమతి చేస్తున్నారు. ఈ క్రమంలో పూల కోత పాటు పూల అల్లకం కూడా మహిళలకు ఉపాధిగా మారింది. పూల కోతకు వెళ్తే ఒక్కొక్కరికి రూ. 250 నుంచి రూ. 400 వరకు కూలి ఇస్తున్నారు. పూల అల్లకం కోసం మండి యజమానులు ఏజెంట్లను ఏర్పాటు చేస్తారు. ఒక్కో ఏంజెంట్‌కు మండి నిర్వాహకులు కిలో పూల అల్లకానికి రూ.60 చెల్లిస్తారు. ఒక్కో ఏజెంట్ రోజూ 100 నుంచి 150 కిలోల విడి పూలను మండి నుంచి తీసుకొచ్చి 250 గ్రాములుగా కవర్లలో ప్యాక్ చేసి ఒక్కో ఇంట్లో 15 ప్యాకెట్లు ఇస్తారు. అల్లిన పూలను తిరిగి సాయంత్రం తీసుకెళ్లి మండిలో అప్పగిస్తారు. ఒక ఇంట్లో ఐదారుగురు ఉంటే రోజు రూ.500 వరకు ఆదాయం పొందుతున్నారు. వేసవి కాలంలో పూల కోతకు కూలీల కొరత ఏర్పడుతోంది. దీంతో ఆళ్లగడ్డ పరిసర ప్రాంతాల నుంచి కూడా కూలీలను ఆటోలలో తరలిస్తారు.

“ దిగుబడి బాగుంది



నాకు రెండెకరాల్లో మల్లె తోట ఉంది. నాలుగేళ్లుగా దిగుబడి వస్తోంది. ఏటా ఎకరాకు రూ. 2 లక్షల లాభం వస్తోంది. మంచి ధర ఉంటే రూ. 3 లక్షలు కూడా వస్తాయి. తోటలను కంటికి రెప్పలా చూసుకోవాలి. తరచూ నీటిని అందిస్తూ, ఎరువులు వేయాలి. ఎనిమిది నెలల పాటు దిగుబడి వస్తోంది. చాగలమర్రిలో వ్యాపారులు మండి ఏర్పాటు చేయడంతో మార్కెటింగ్‌కు ఇబ్బందుల్లేవు.

– రైతు షేక్ షరీఫ్, ముత్యాలపాడు

“ రైతులకు ముందే అడ్వాన్స్ ఇస్తాం



మల్లె పూల మార్కెట్‌కు చాగలమర్రి తలమానికంగా మారుతోంది. ఈ ప్రాంతంలో పండించిన పూలు దేశంలోని ప్రధాన నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. వందల మంది రైతులు ఇక్కడే పూలు విక్రయించి లాభాలు పొందుతున్నారు. మేము కొంత మంది సన్నకారు రైతులకు పంట సాగుకు అవసరం కోసం కొంత మొత్తం అడ్వాన్స్‌గా ఇస్తాం. సీజన్ పూర్తయ్యేలోపు దిగుబడికి చెల్లించే మొత్తం నుంచి కొంత పట్టుకుంటాం.

– మహబూబ్ హుసేన్, మండి యజమాని, చాగలమర్రి

పూల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం



పూల తోట సాగు చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఐదెకరాల లోపు విస్తీర్ణం కలిగిన రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.6 వేల చొప్పున రెండేళ్ల పాటు మంజూరు చేస్తుంది. అలాగే ఉపాధి హామీ పథకం కింద పూల తోట సాగు ప్రారంభించే రైతులకు వంద శాతం సబ్సిడీతో అండగా నిలుస్తోంది. ప్రభుత్వ అందించే రాయితీలను పూల తోటల సాగు చేసే రైతులు సద్వినియోగం చేసుకోవాలి. – నరేష్‌కుమార్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి,

క్లుప్తంగా

బాలికపై ఆటోడ్రైవర్ అసభ్యప్రవర్తన

- పోక్సో కేసు నమోదు

కర్నూలు : బీక్యాంపునకు చెందిన ఆటోడ్రైవర్ ఈశ్వర్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. గణేష్ నగర్‌కు చెందిన బాలికను స్కూల్‌కు ప్రతిరోజు తీసుకువెళుతూ పరిచయం పెంచుకున్నాడు. ఈనెల 7 వ తేదీన ఆటోలో నగర శివారులోకి తీసుకు వెళ్లి అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక కేకలు వేయడంతో వదిలేసి పారిపోయాడు. బాలిక కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

కర్నూలు: డోన్ మండలం దొరపల్లి గ్రామానికి చెందిన మౌనిక (39) అదృశ్యం అయ్యింది. డోన్ మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన చిన్న కాశయ్యతో ఏడేళ్ల క్రితం ఆమెకు వివాహం అయ్యింది. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాలతో గత ఏడాది భర్తతో విభేదించి కర్నూలు నగరంలోని బుధవారపేటలో ఉన్న అవ్వ ఇంట్లో ఉంటోంది. అయితే తల్లిదండ్రులు కలుగ జేసుకొని మళ్లీ భర్తతో కాపురం చేసే విధంగా పంచాయితీ నిర్వహించడంతో మౌనికకు ఇష్టం లేక అవ్వ ఇంట్లో నుంచి కూడా కనిపించకుండా పోయింది. దీంతో తండ్రి మద్దయ్య మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత బలవన్మరణం

ఆలూరు/దేవనకొండ: మండల కేంద్రమైన దేవనకొండలో ఓ వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు భర్త వేధింపులే కారణమని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదోని పట్టణ కేంద్రానికి చెందిన చాకలి లక్ష్మన్న, శాంతమ్మ దంపతుల పెద్దకుమార్తె శశికళను దేవనకొండ గ్రామానికి చెందిన చాకలి గోపాల్, శాంతి దంపతుల కుమారుడు నరేష్‌కు ఇచ్చి 12 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆరు నెలల నుంచి భార్య, భర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. పెద్దలు పంచాయితీ కూడా చేశారు. అయితే ఆదివారం తెల్లవారుజామున అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోనే ఉరివేసుకుని శశికళ(27) ఆత్మహత్య చేసుకుంది. భర్త నరేష్, మామ లక్ష్మన్న, అతని కుమారులు వీరేష్, నాగ రాజు, చిన్న వీరేష్ తదితరులు తమ కుమార్తె మృతికి కారణమని మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దేవనకొండ ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు.

నేడు శ్రీశైలంలో ఉచిత సామూహిక సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఉచిత సామూహిక సేవల్లో భాగంగా సోమవారం మహా మృత్యుంజయ హోమం నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న తెలిపారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన సామాన్య భక్తులు నెలలో ఒకరోజు ఉచిత సామూహిక సేవలను జరిపించుకునే అవకాశాన్ని దేవస్థానం కల్పిస్తుందన్నారు. ఉదయం 9.30 గంటలకు చంద్రవతి కల్యాణ మండపంలో నిర్వహించనున్న సామూహిక మహామృత్యుంజ హోమానికి 250 మంది ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నట్లు ఈఓ వివరించారు. సేవాకర్తలకు హోమం అనంతరం ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామివారి ఆలంకార దర్శనం, అమ్మవారి దర్శనం కల్పించబడుతుందన్నారు.

పెద్దాసుపత్రిలో దొంగలు బాబోయ్ !

- రోగుల డబ్బులు, సెల్‌ఫోన్లు మాయం
- పిక్ ప్యాకెటర్ల చేతివాటం
- మహిళా దొంగలే అధికం


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల


రద్దీగా ఉన్న మెడికల్ విభాగం(ఫైల్)

- నందికొట్కూరుకు చెందిన శాంతమ్మ అనే మహిళ శనివారం న్యూరోసర్జరీ ఓపీకి వచ్చింది. రద్దీగా ఉన్న ఓపీలో నిలబడి వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స చేయించుకుని వచ్చేలోపు తన బ్యాగులోని సెల్‌ఫోన్ కనిపించకుండా పోయింది. బ్యాగ్‌ను తరచి చూస్తే దానికి బ్లేడుతో కోసినట్లు కనిపించింది.
- కోడుమూరుకు చెందిన రామాంజనేయులు నడుము నొప్పితో బాధపడుతూ చికిత్స కోసం గత శుక్రవారం పెద్దాసుపత్రికి వచ్చాడు. ఓపీ టికెట్ కోసం నిలబడే ఓపికలేకపోవడంతో భార్యను పంపాడు. ఆమె రద్దీగా ఉండే క్యూలో నిలబడి ఓపీ టికెట్ సాధించింది. బయటకు వచ్చి చూసే సరికి ఆమె పర్సును దొంగలు కొట్టేశారు. అందులో రూ. 3,400 ఉన్నట్లు ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బందికి తెలిపింది.

కర్నూలు(హాస్పిటల్): ప్రైవేటు ఆసుపత్రుల్లో వేల రూపాయలు ఖర్చు చేయలేక చాలా మంది ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుంటారు. అలాంటి పేదవారినే లక్ష్యంగా చేసుకుని కొందరు దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రద్దీ సమయంలో డబ్బులు, సెల్‌ఫోన్లు తస్కరిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఆసుపత్రిలో రోజూ నాలుగైదు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి 2,500 నుంచి 3వేల మంది దాకా ఓపీ కోసం వస్తుండగా, ఇన్‌పేషంట్లుగా నిత్యం 1,500 మంది దాకా ఉంటున్నారు. రోగి వెంట సహాయంగా తప్పనిసరిగా ఒకటి నుంచి ఇద్దరు, ముగ్గురు వెంట వస్తున్నారు. ఈ కారణంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోగులు, వైద్యులు, సిబ్బంది కలిపి మొత్తం పదివేల మందికి పైగా ఆసుపత్రిలో తిరుగుతూ కనిపించడంతో రద్దీ వాతావరణం కనిపిస్తుంది. ఈ పరిస్థితే దొంగలకు అనుకూలంగా మారింది. కర్నూలు నగరంలోని పలు ప్రాంతాలతో పాటు పక్కనున్న గ్రామాలు, తెలంగాణ ప్రాంతాల నుంచి దొంగలు ఆసుపత్రికి వస్తున్నారు. కొందరు మహిళలు రోగులు, వారి సహాయకుల మాదిరిగా వస్తుంటే, మరికొందరు మహిళలు బుర్కాలు ధరించి వస్తున్నారు.

రద్దీ ప్రాంతాలే లక్ష్యం

ఆసుపత్రిలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోగులు, వారి సహాయకులతో రద్దీగా ఉంటుంది. ముఖ్యంగా ఓపీ టికెట్లు ఇచ్చే కేంద్రం వద్ద ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఎక్కువగా క్యూలో నిలబడి ఉంటారు. దీంతో పాటు మెడికల్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, సైకియాట్రీ, న్యూరోసర్జరీ, కార్డియాలజీ, యురాలజీ, గైనకాలజీ, పీడియాట్రిక్ ఓపీల వద్ద, రక్తపరీక్షలు, ఎంఆర్‌ఐ, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు, ఎక్స్‌రే రిపోర్ట్‌లు ఇచ్చే కేంద్రం వద్ద రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి రద్దీ కేంద్రాలే దొంగలకు అనువుగా మారాయి. రోగుల మధ్యలో రోగుల మాదిరిగా దూరిపోయి బ్లేడుతో బ్యాగ్‌ను కోసి అందులోని డబ్బు, పర్సులు, సెల్‌ఫోన్‌లు కొట్టేస్తున్నారు. మరికొందరి జేబులు, జాకెట్లలోని డబ్బు, పర్సు, సెల్‌పోన్లను దొంగిలిస్తున్నారు. రద్దీ నుంచి బయటకు వచ్చి చూసుకునే సరికి డబ్బు, సెల్‌ఫోన్లు కనిపించకపోవడంతో రోగులు, వారి సహాయకులు విలపిస్తున్నారు. మరికొందరు రాత్రివేళల్లో వార్డుల్లో కలియదిరుగుతున్నారు. రోగుల పక్కనే కాసేపు నిద్రించి రోగులు, సహాయకుల తల వద్ద, చార్జింగ్ పెట్టుకున్న సెల్‌ఫోన్లను, డబ్బును తస్కరిస్తున్నారు. ఇంకొందరు ఏకంగా ఆసుపత్రి వైద్య విద్యార్థుల సెల్‌ఫోన్లు, మోటార్‌బైక్‌లు, డబ్బును దొంగిలిస్తున్నారు.

ఇద్దరు, ముగ్గురుగా వచ్చి చోరీ

ఓ సినిమాలో హీరో, హీరోయిన్లు, అతని స్నేహితుడు దొంగలు. వారు దొంగతనాలు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. పిక్‌ప్యాకెట్లు కొట్టేసేందుకు వారు ముగ్గురూ మార్కెట్లు, మాల్స్‌కు వెళ్తుంటారు. ఒకరు దొంగతనం చేస్తే, చోరీ చేసిన దానిని వెంటనే మరో వ్యక్తికి చేరవేస్తారు. దొంగతనం చేసిన వ్యక్తి వద్ద అప్పటికప్పుడు తనిఖీ చేస్తే ఏమీ లభించదు. సరిగ్గా ఇలాంటి సూత్రాన్నే ఎంచుకున్నారు కొందరు దొంగలు. ఇద్దరు, ముగ్గురుగా ఆసుపత్రికి వచ్చి ఒకరు దోచిన పర్సు, సెల్‌ఫోన్లను క్షణాల్లో చేతులు మార్చి అక్కడి నుంచి వెళ్లిపోతుంటారు. ఇలా ఒకరి నుంచి మరొకరు వస్తువులు చేతులు మార్చుకుంటూ ఆసుపత్రి బయటకు వెళ్లాక వస్తువులు పంచుకుంటూ ఉంటున్నారు. ఈ కారణంగా దొంగతనం చేసినట్లు అనుమానం వచ్చి వ్యక్తిని పట్టుకుని తనిఖీ చేస్తే వారి వద్ద ఏమీ కనిపించడం లేదు.

> **సెక్యూరిటీని అప్రమత్తం చేశాం**
>
> ఆసుపత్రిలో దొంగతనాలు జరగకుండా సెక్యూరిటీని అప్రమత్తం చేశాం. రద్దీ ప్రాంతాలపై దృష్టి సారించి నేరాలను అరికట్టాలని సూచించాం. ఇప్పటికే పలు ప్రాంతాల నుంచి ప్రతిరోజూ దొంగతనాలు జరిగాయని తమకు ఫిర్యాదులు వస్తున్నాయి. అప్పటికప్పుడు సెక్యూరిటీసిబ్బంది స్పందించి దొంగతనాలు జరిగినచోట్ల తనిఖీలు చేస్తున్నారు. కొందరు ఇటీవల రెడ్‌హ్యాండెడ్‌గా దొరికితే పోలీసులకు అప్పగించాం. –డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా...

ఆసుపత్రిలో రోగుల, వారి సహాయకుల రక్షణ కోసం ప్రైవేటు ఏజెన్సీ ద్వారా సెక్యూరిటీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. మూడు షిఫ్ట్‌ల వారిగా 180 మందికి పైగా సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కానీ వీరి పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో దొంగతనాలు యథేచ్ఛగా జరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. రద్దీగా ఉండే ప్రాంతాల్లో గాకుండా ఇతర ప్రాంతాల్లో ఎక్కువగా వీరికి డ్యూటీలు వేస్తుండటంతో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రద్దీ ప్రాంతాల్లో వీరు తరచూ అనుమానం వచ్చిన వ్యక్తులను విచారిస్తూ ఉంటే ఈ పరిస్థితి రాదని వైద్యసిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించండి

కర్నూలు(రాజ్‌విహార్): గాలి, వర్షాలతో విద్యుత్ అంతరాయ సమస్యలు తలెత్తుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, సిబ్బంది వెంటనే స్పందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి అన్నారు. ఆదివారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిష్కారం చూపాలన్నారు. వీటిపై నిర్లక్ష్యం వహించడం తగదన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

నందికొట్కూరు: పట్టణంలోని కర్నూలు రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పగిడ్యాలకు చెందిన బోరెల్లి శ్రీనివాసులు(33) శనివారం పని మీద నందికొట్కూరుకు చేరుకున్నాడు. మృతుడి భార్య ఐదేళ్ల క్రితం చనిపోయింది. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటన స్థలాన్ని రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. మృతుడి తండ్రి వెంకటరాజు ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్‌ఐ ఎన్వీ రమణ కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

అవుకు: బైక్ అదుపు తప్పి కింద పడిన ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల మేరకు.. శింగనపల్లె గ్రామానికి చెందిన మిద్దె శిరోమణి(53) కోవెలకుంట్ల ఆర్టీసీ డిపోలో స్వీపర్‌గా పని చేస్తోంది. అయితే శనివారం రాత్రి పని ముగించుకొని రెండవ కుమారుడు మిద్దె ఓబుళపతితో కలిసి బైక్‌పై శింగనపల్లెకు బయల్దేరింది. కాగా అప్పటికే పెనుగాలులకు శింగనపల్లె గ్రామ సమీపంలోని రాగి చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. ఓబుళపతి చెట్టును తప్పించబోయి అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో శిరోమణి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి పెద్ద కుమారుడు మిద్దె ఓబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ నరేంద్రకుమార్ తెలిపారు.

భార్య, అత్తను హత్య చేసిన యువకుడు

- బాపురం గ్రామంలో దారుణం


మహదేవి


హనుమంతమ్మ (ఫైల్)

కౌతాళం: మండల పరిధిలోని బాపురం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ యువకుడు భార్యను, అత్తను హతమార్చాడు. ఈ విషయం ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు..బాపురం గ్రామానికి చెందిన హనుమంతమ్మ గ్రామ తలారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈమె కుమార్తె మహదేవి కూడా గ్రామంలోనే వలంటీర్‌గా పనిచేస్తున్నారు. మహదేవికి గతంలో వీరాలదిన్నెకు చెందిన దస్తగిరితో వివహమైంది. మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం తెక్కాలకోట పక్కనే ఉన్న దేవనగర్‌కు చెందిన రమేష్ డీలర్‌గా పనిచేస్తున్నాడు. మొదటి భార్య వారం రోజుల్లోనే మృతి చెందడంతో రెండో పెళ్లి చేసుకున్నాడు. నాలుగు నెలల తర్వాత రెండో భార్యకు విడాకులు ఇచ్చాడు. రమేష్‌కు, మహదేవికి పెద్దలు ఏప్రిల్ 30వ తేదీన కర్ణాటక రాష్ట్రం హచ్చోళ్లి మఠంలో వివాహం జరిపించారు. మహదేవి వలంటీర్‌గా ఉండడంతో ఇల్లరికం రావాలని అత్త హనుమంతమ్మ అల్లుడిని కోరగా అందుకు నిరాకరించాడు. దేవనగర్‌లోనే ఉండాలని పట్టుపడడంతో ఇద్దరి మధ్య శుక్రవారం రాత్రి గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో క్షణికావేశానికి గురైన రమేష్ కట్టె, రోకలిబండతో అత్త హనుమంతమ్మ (45), భార్య మహదేవి (25)ని కొట్టి చంపేశాడు. శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లి తల్లితో, బంధువులతో జరిగిన సంఘటన గురించి తెలుపగా పోలీసుల వద్దకు పోయి సరెండర్ కావాలని చెప్పారు. విషయాన్ని కౌతాళం ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలుపడంతో ఆదివారం తెల్లవారు జామున సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. తలారి హనుమంతమ్మ అన్న అయ్యప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేలిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్

ఎమ్మిగనూరురూరల్: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణం ఆదోని రోడ్డు లక్ష్మణ్ థియేటర్ విశాల్ మార్ట్ పక్కన ఉన్న 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ శని వారం అర్ధరాత్రి పేలింది. అర్ధరాత్రి శబ్దం రావడం, ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు భయంతో పిల్లలను తీసుకొని పరుగులు తీశారు. మంటలు చెలరేగినప్పుడు గాలులు లేకపోవటంతో పెనుప్రమాదం తప్పింది. ట్రాన్స్‌ఫార్మర్ పక్కన కాంక్రీట్ ఇళ్లు ఉండటంతో ఏమీ కాలేదు. అయితే ఒక బైక్‌కు మంటలు తాకటంతో ఇంజిన్ కాలిపోయింది. వెంటనే అక్కడి వారు మంటలకు నీళ్లు పోసి ఆర్పివేశారు. ప్రమాదం జరిగినప్పుడు నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను ఆదివారం సాయంత్రం 7 గంటలకు పునరుద్ధరించారు. ఇళ్ల పక్కన కాకుండా జన సంచారం లేని చోట 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు ఎగిసిపడుతున్న దృశ్యం

సంక్షేమ సారథి సీఎం జగన్


వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన విద్యావంతులతో స్థానిక మైపర్ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో అమలు కాని హామీలు, మోసాలు, రాష్ట్ర స్థితి గతులు, నేటి సీఎం జగన్ నాలుగేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పేదలకు కలిగిన లబ్ధి, మెరుగైన భవిష్యత్తు కోసం ఆయన మళ్లీ సీఎం కావాల్సిన అవసరాలను డెమో ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు. 108, 104 అంబులెన్స్‌లు, ఫ్యామిలీ క్లినిక్‌లు, మెడికల్ కళాశాలల మంజూరు, వైద్య ఆరోగ్య శాఖలో వేల ఉద్యోగాల భర్తీ, నాడు– నేడుతో ప్రభుత్వ ఆసుపత్రుల రూపు రేఖల మార్పు లాంటివి సీఎం జగన్‌కు తప్ప గతంలో ఎవరికీ సాధ్యపడలేదని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థతో లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాలనను పారదర్శ్యంగా ఇంటి వద్దకే అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని, విద్యావంతులు ఆలోచించి విస్తృత ప్రచారానికి సహకరించాలని కోరారు. అనంతరం ఆ విభాగం కర్నూలు, నంద్యాల జిల్లాల జోనల్ ఇంచార్జీ డాక్టర్ హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వైద్యరంగంలో సీఎం జగన్ గొప్ప సంస్కరణలు తెచ్చారన్నారు. అనంతరం కర్నూలు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సీఎం జగన్ వైద్య సేవలను పల్లెబాట పట్టించారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జ్ఞానేశ్వర్, పార్టీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, రవిబాబు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్యతో చేతుల మీదుగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు పోస్టర్లు విడుదల చేశారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం




శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని పాతాళగంగలో గుర్తు తెలియని మహిళ (55 –60 సంవత్సరాలు) మృతదేహం లభ్యమైంది. ఆదివారం మత్స్యకారులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ ఎస్‌ఐ లక్ష్మణరావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆమె కాషాయ రంగు దుస్తులు (చీర, జాకెట్) ధరించి ఉందని, మెడలో రుద్రాక్షమాలను పోలిన హారం ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆమె కుడి చేతికి ఆరువేళ్లు ఉన్నాయన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రాజెక్టు వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పలు చోట్ల ఆదివారం ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. చిప్పగిరిలో 18.6, మద్దికెరలో 15.2, దేవనకొండలో 12.8, ఎమ్మిగనూరులో 7.2, గోనెగండ్లలో 7.0, కోడుమూరులో 2.6 మి.మీ. ప్రకారం వర్షపాతం నమోదైంది. కర్నూలులో సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. నంద్యాల జిల్లా ప్యాపిలిలో 15.2, కొలిమిగుండ్లలో 15 మిమీ వర్షపాతం నమోదైంది. జూన్ నెల సాధారణ వర్షపాతం కర్నూలు జిల్లాలో 77.7 మి.మీ. ఉండగా... ఇప్పటి వరకు 25.6 మి.మీ., నంద్యాల జిల్లాలో 76.8 మి.మీ. ఉండగా..12.6 మి.మీ. కురిసింది. ఇదిలా ఉండగా జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. ఆదివారం మహానంది మండలం గాజులపల్లిలో 42, ఆలూరులో 41.07 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

పిడుగు పడి రైతు మృతి


సోమప్ప(ఫైల్)

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగు పడి కురువ సోమప్ప (45) అనే రైతు మృతి చెందాడు. బంధువులు, గ్రామస్తుల తెలిపిన వివరాల మేరకు...కురువ సోమప్ప ఆదివారం ఒక్కడే పొలానికి వెళ్లాడు. సాయంత్రం ఉరుములు, మెరుపుల భారీ శబ్దాలతో వర్షం కురిసింది. వర్షం తగ్గి రాత్రయినా సోమప్ప ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా సోమప్ప కాలిన గాయాలతో శరీరం అంతా నల్లగా మారి విగత జీవుడిగా పడి ఉన్నాడు. పిడుగు పడి మృతిచెందాడని తెలుసుకుని భార్య మీనాక్షి, పిల్లలు, బంధువులు సోమప్ప మృతదేహం వద్ద రోదించారు. ఈ ఘటనపై హొళగుంద ఎస్‌ఐ శ్రీనివాసులు విచారణ చేపట్టారు.

విద్యుదాఘాతంతో బిహార్ వాసికి గాయాలు

- ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై నుంచి నిలిచిన రైలు ఇంజిన్‌పై పడిన వైనం
- హై ఓల్టేజ్ విద్యుత్ తీగలు తగిలి పరిస్థితి విషమం


తీవ్రగాయాలకు గురైన బిహార్‌వాసి

డోన్ టౌన్: స్థానిక రైల్వే స్టేషన్‌లో బిహార్ వాసి ప్రమాదవశాత్తూ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. రైల్వే స్టేషన్‌లో ఆదివారం తెల్లవారు జామున సుమారు 5.20 గంటల సమయంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై నుంచి బిహార్ రాష్ట్రానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి నిలిచిన రైలు ఇంజిన్‌పై పడ్డాడు. ఆ సమయంలో హై ఓల్టేజ్ విద్యుత్ తీగలు తాకి విద్యాదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్టేషన్ సిబ్బంది 108లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. సంతోష్ తన వివరాలు చెప్పలేకపోతున్నాడని, ప్రమాదవశాత్తూ కింద పడ్డడా? ఆత్మహత్య చేసుకున్నాడా అనేది తెలియలేదని రైల్వే ఎస్‌ఐ తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9441759875కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

బధిరుల క్రీడా సమాఖ్య ఎన్నికలు ఏకగ్రీవం

- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వాసుదేవరెడ్డి, ఎస్‌ఎండీ సాదిక్‌బాషా


నూతన కార్యవర్గసభ్యులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లా బధిరుల క్రీడా సమాఖ్య(స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్‌ది డెఫ్ శాఖ) నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆదివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో బధిరుల సంఘం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా జి.సత్యనారాయణరెడ్డి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం. వాసుదేవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ ప్రకాశ్ కిరణ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌ఎండీ సాదిక్‌బాషా, జాయింట్ సెక్రటరీగా పి.శివప్రసాద్, కోశాధికారిగా ఏ.నాగరాజు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎండీ సాహిద్‌బాషా, అబిద్‌హుసేన్, బి.కళ్యాణ్‌బాబు, ఎస్.ఖాజాబాషా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు.

ఆగస్టులో వాల్మీకుల చలో పార్లమెంట్

- వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం. సుభాష్ చంద్రబోస్


సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వాల్మీకి/ బోయలను ఎస్టీలుగా గుర్తిస్తూ కేంద్రానికి పంపిన తీర్మానాన్ని పార్లమెంట్‌లో ఆమోదించాలనే డిమాండ్‌పై ఆగస్టులో చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం సుభాష్ చంద్రబోస్ చెప్పారు. ఆదివారం సీ క్యాంప్‌లోని కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన తీర్మానాన్ని పార్లమెంట్‌లో ఆమోదించి చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గత ఎన్నికల సమయంలో కర్నూలులో జరిగిన బహిరంగసభలో మాట్లాడుతూ ఎస్టీ రిజర్వేషన్ అంశంలో వాల్మీకులకు న్యాయం చేస్తామని ప్రకటించారన్నారు. ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన తీర్మానాన్ని పార్లమెంట్‌లో ఆమోదించే విధంగా ప్రధానమంత్రి చర్యలు తీసుకోవాలన్నారు. పార్లమెంట్‌లో వాల్మీకుల ఎస్టీ బిల్లు ఆమోదం పొందేంతవరకు ఢిల్లీ కేంద్రంగా వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా చలో పార్లమెంట్ కార్యక్రమానికి వాల్మీకులు స్వచ్ఛందంగా కదలిరావాలని కోరారు. ఈ సమావేశంలో వీఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గూడురు గిడ్డయ్య, జీ రాం భీంనాయుడు, ఉపాధ్యక్షులు మాలపల్లి లక్ష్మయ్య, శేఖర్, మల్లికార్జున, ఎల్ వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు మొలగవెల్లి రామాంజనేయులు, నంద్యాల జిల్లా అధ్యక్షులు మునగాల శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి ఖాశీంనాయుడు పాల్గొన్నారు.

వీఆర్‌పీఎస్ నూతన కార్యవర్గం ...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురు నాయకులకు వీఆర్‌పీఎస్ నూతన కార్యవర్గంలో బాధ్యతలను అప్పగించినట్లు సుభాష్ తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పరమటూరు శేఖర్, నంద్యాల జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మునగాల శ్రీనివాసులు, బోయ బాలహుసేన్‌ను ఎంపిక చేసినట్లు చెప్పారు.